**జరిగిన కథ :** కన్యాకుబ్జ యువరాజు పుష్పకేతుడితోపాటు అతని నలుగురు సోదరులూ.. తమిళ దేశంలోని స్త్రీ రాజ్యానికి వెళ్లారు. అక్కడ పుష్పకేతుడి సోదరులు నలుగురూ కనిపించకుండా పోయారు. వాళ్లను కనుగొనే ప్రయత్నంలో సౌమ్యుడనే ఆఖరు తమ్ముడు ఒక వేశ్య ఇంటిలో చిక్కుకున్నాడని తెలిసి.. ఆ వేశ్యను విద్యలలో ఓడించాడు పుష్పకేతుడు.






# మణిమంతుడి అల్లుడు


అనుసృజన:

**నేతి సూర్యనారాయణ శర్మ**


ఆ నారీరత్నం వయ్యారంగా నడిచి వచ్చింది. పుష్పకేతుని మెడలో వరమాల వేసి, పాదాలకు నమస్కరించింది.

''స్వామీ! నా పూర్వపుణ్యం ఇప్పటికి ఫలించింది. సకల కళాకోవిదులైన మిమ్మల్ని పతిగా పొందగలిగాను'' అన్నది.

పుష్పకేతుడు దూరంగా జరిగాడు.

''నేను నీవంటి వేశ్యల వలలో పడేవాణ్ని కాను. నా తమ్ముడైన సౌమ్యుడిని నీ చెర నుంచి తప్పించడానికే నిన్ను విద్యలలో ఓడించాను. వాణ్ని పిలిపిస్తే వెళ్లిపోతాను'' అని పలికాడు.

ఆమె వెలవెలపోయే ముఖంతో..

''రాజనందనా! ముందు నా వృత్తాంతమంతా వినండి. తరువాత మీ ఇష్టం వచ్చినట్లు చేయవచ్చు. నేను వేశ్యను కాను. ఈ దేశాన్ని పాలించే మహారాణిని. నన్ను రత్నమకుట అంటారు. నేనీ రాజ్యానికి వచ్చి సంవత్సరం దాటింది. మా దేశాచారాలు విచిత్రమైనవి. మా రాజ్యంలో విద్యాధికులైన పురుషులు చాలా తక్కువగా ఉన్నారు. నేను ఉత్తముడైన పతిని పొందాలని, ఒక బౌద్ధసిద్ధుణ్ని ఆశ్రయించాను. ఆయన నా భక్తికి మెచ్చి.. కొన్ని శ్లోకాలు గల ప్రశ్నోత్తరాలు రాసి ఇచ్చాడు. 'వీటికి ఎవరు సరైన సమాధానాలు ఇస్తారో వారిని నువ్వు వరించు' అని బోధించాడు. నేను ఆ రీతిగానే.. నా ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన వారినే వరిస్తానని బహిరంగంగా ప్రకటించాను.

నేను మహారాణిని కావడంతో అత్యాశతో రోజూ ప్రతివాడూ వచ్చి విసిగిస్తుండేవాడు. దాంతో విసిగి, ఈ ఎత్తు పన్నాను. ఈ భవంతి ముందు వేరొక చిత్రపటాన్ని వేలాడదీసి, వేశ్యగా చిత్రించాను. ఆ చిత్రాన్ని చూసి కూడా చాలామంది వస్తుండటంతో.. ఓడినవారిని తోటపనికి వినియోగిస్తానని షరతు పెట్టాను. ఆ షరతు మేరకే మీ తమ్ముడు పనివాడయ్యాడు. అతను వలచింది చిత్రంలోని వేశ్యను. కానీ, నిజంగా నన్ను గెలిచింది మీరే!'' అని చెప్పి ఆపింది.

పుష్పకేతుడు ఆమె మాటలకు సంతోషించాడు. పక్కనే ఉన్న పుష్పమాలను ఆమె మెడలో వేశాడు. ఆ మరునాడే పుష్పకేతుడు ఆ రాజ్యానికి రాజయ్యాడు. అయితే స్త్రీ మాత్రమే పాలకురాలు కావాలనే ఆ రాజ్యపు సంప్రదాయాన్ని అనుసరించి.. రత్నమకుటకే సింహాసనంపై కూర్చునే అవకాశమిచ్చాడు. పుష్పకేతుని తమ్ముడైన సౌమ్యుడితో పాటుగా.. అంతకుముందు ఓడినవారందరూ విడుదలయ్యారు. ఇక తన మిగిలిన ముగ్గురు తమ్ముళ్లనూ వెతకాల్సిన బాధ్యత పుష్పకేతునిపై ఉంది. కానీ, ఎంత ప్రయత్నించినా వారెక్కడికి వెళ్లారో తెలియరాలేదు.

* * *

ఒకనాడు.. ఆ రాజ్యపాలనా విశేషాలు ఎలా ఉంటాయో తెలుసుకోవాలనే కుతూహలంతో పుష్పకేతుడు కూడా, రత్నమకుటతో పాటుగా కొలువుకూటానికి వచ్చాడు. సింహాసనానికి పక్కగా వేరొక పీఠంపై కూర్చున్నాడు. పక్కనే భర్త ఉండటంతో కొంచెం వణుకుతున్న గొంతుతో..

''మంత్రిగారూ! ఈరోజు విచారించాల్సిన అభియోగాలు ఏమున్నాయి?!'' అని ప్రశ్నించింది రత్నమకుట.

మంత్రి పైకి లేచి..

''మహారాణీ! నేడు ముఖ్యంగా రెండు హత్యాపరాధ విషయాల్లో తీర్పు ఇవ్వాల్సి ఉంది. ఒకదానిలో వాది, ప్రతివాదులు ఇద్దరూ వచ్చారు. రెండోదానిలో వాది మాత్రమే వచ్చాడు'' అని చెబుతూ కాగితాలకట్ట ఆమెకు అందించాడు.

రత్నమకుట వణికే చేతులతో వాటిని అందుకుని..

''మీ ఎదుట నేను తీర్పు తీర్చలేను. మీరే విచారించి, న్యాయం చేయండి'' అని భర్తకు అందించింది.

అతడు నవ్వుతూ..

''నీ పాలనావిధానం చూడాలని నేను వస్తే నా మీదే